క్లుప్తంగా

హెల్ప్‌లైన్ సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులతో సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని, ముఖ్యంగా శిశు, మహిళా సమస్యల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో పాఠశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యం

జన్నారం: వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, వాతావరణ పరిరక్షణ కేవలం మొక్కలతోనే సాధ్యమని రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అన్నారు. మండలంలోని కలమడుగు వివేకానంద పాఠశాలలో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తన పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటడం మరువకూడదన్నారు. ఇంటింటికీ మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెరిగి కాలుష్యం నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళి, వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ సతీశ్‌గౌడ్, బీట్ అధికారి ముజీబోద్దీన్, పీసీ తిరుపతి, ఇన్‌చార్జి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్ కళాశాల కల్చరల్ డే



విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానికంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో మిమ్స్ జూనియర్ కళాశాల కల్చరల్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. ఈ సందర్భంగా గతేడాది స్టేట్‌ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు మెడిసిన్, వెటర్నరీ, ఐఐటీ ర్యాంకులు సాధించిన వారికి ప్రశంసపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రెసిడెంట్ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్స్ శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

తాండూర్/జైపూర్/బెల్లంపల్లి: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య, శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు,జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు, తాండూర్ సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి కానీ హద్దులు మీరొద్దని తెలిపారు. డిసెంబర్ 31స్ట్ రాత్రి పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ ముమ్మరంగా నిర్వహించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరిస్తే 100కు డయల్ చేయాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దన్నారు. బైక్ నడుపుతూ మైనర్లు పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలు సహకరించాలి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో రహదారుల మరమత్తులు చేపట్టినందునా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ నరేష్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీ స్‌స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. వాహనాలపై విధించిన పెండింగ్ చ లాన్లపై ప్రభుత్వం బారీ డిస్కౌంట్ ప్రకటించిందని తెలిపారు. 26 నుంచి జనవరి 10వరకు చెల్లించేలా అవకాశం కల్పించిందన్నారు. వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడువు పొడిగించాలి

మంచిర్యాలఅర్బన్: ఫీజు రియెంబర్స్‌మెంట్ దరఖాస్తు తేదీని పొడగించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయెంబర్స్‌మెంట్ పథకం దరఖాస్తు ఈ నెల 31తో గడువు ముగుస్తుందన్నారు.

న్యూ ఇయర్ సందడి..!



సిద్ధమైన కేకులు



మార్కెట్లో రంగుల కొనుగోళ్లు





- మార్కెట్లో వెరైటీ కేక్‌లు సిద్ధం

మంచిర్యాలఅర్బన్: కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అంతా సిద్ధమవుతున్నారు. కుటుంబసభ్యులతో టూరిస్టు ప్లేస్.. ఇంట్లోనో గ్రాండ్‌గా పార్టీ చేసుకునేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. న్యూ ఇయర్ అనగానే ముందుగా గుర్తుచ్చేది కేక్‌లు.. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆకర్షణీయమైన రంగుల్లో బేకరీ యజమానులు కేక్‌లు అందుబాటులో ఉంచారు. బొమ్మలతో పాటు సందేశాత్మకమైన కేక్‌లు రెడీ చేశారు. నూతన సంవత్సర వేళ కొత్తకొత్త వెరైటీలతో కేక్‌లు సిద్ధం చేశారు.

ఆర్డర్‌పై టేస్టీటేస్టీగా..

కాలానికి అనుగుణంగా ఎన్నో వెరైటీ కేక్‌లు తయారు చేస్తున్నారు. బ్లూబెర్రీ, బ్లాక్ కరెంట్, స్ట్రాబెర్రీ, రెడ్‌వెల్ వైట్, డ్రైఫ్రూట్, బట్టర్‌స్కాచ్, పైనాపిల్, బ్లాక్ ఫారెస్ట్, చాక్‌లెట్, బెస్ట్ ఫ్రూట్, మెరింగ్ న్యూస్, కస్టర్డ్స్, నట్స్, డెజర్ట్ సాస్, బటర్ క్రీమ్, ఎన్నో రకాల కేక్‌లు తయారు చేసి ఇస్తున్నారు. కష్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ఆర్డర్‌పై కేక్‌లు రెడీ చేసి ఇస్తున్నారు. కేక్‌లను బట్టి ధరలున్నాయి. రూ.130నుంచి రూ.1000లోపు ధరలు పలుకుతున్నాయి.

న్యూఇయర్‌కు ఆఫర్లు..

మార్కెట్‌లో పోటీపడి కేక్‌లు, ఇతర ఫుడ్ ఐటమ్‌లకు న్యూ ఇయర్ ఆఫర్లు ప్రకటించాయి. రూ.600ఉన్న కేక్ రూ.500, రూ.900లుంటే 600, రూ.130 ఉంటే రూ.100, రూ.260ధర ఉన్న నార్మల్ కేక్ రూ.200కు ఆఫర్లు ప్రకటించారు. రూ.250కే కిలో కేక్, చికెన్ బిర్యానీ, మినీ థమస్‌లు న్యూఇయర్ ఆఫర్ కింద ప్రకటించారు. మద్యం, మాంసానికి ఉండే డిమాండ్ మాటల్లో చెప్పరానిది.

రంగులకు డిమాండ్..

నూతన సంవత్సర వేళ స్వీట్లు పంచుకోవటం.. గ్రీటింగ్ చెప్పుకోవటం.. పార్టీలు చేసుకోవటం ఒక ఎత్తు. ఇంటి ముందు వేసే ముగ్గు మరో ఎత్తు. ఇంటి ముందర వేసిన ముగ్గు ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటారు. రంగోలి కలర్‌ఫుల్‌గా కనిపించే రంగులకు డిమాండ్ పెరిగింది. ముగ్గులు సులువుగా వేసేందుకు జల్లెడలు లభిస్తున్నాయి. రంగుల కొనుగోలుకు మార్కెట్లో సందడి నెలకొంది.

గతి తప్పుతున్న 'అంగన్‌వాడీ'..!

- చర్లపల్లిలో సమయపాలన పాటించని సిబ్బంది
- ఇప్పటికే రెండుసార్లు మెమో జారీ చేసినా రాని మార్పు

మాది చర్లపల్లి గ్రామం. నాకు రెండేళ్ల పాప ఉంది. మా ఊరి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాం. రోజూ కేంద్రానికి వెళ్లి వస్తుంది. కానీ మా టీచర్ సరిగ్గా రాదు. గుడ్లు పూర్తిగా ఇవ్వదు. సత్తుపిండి ఇస్తుంది. అన్నం పెట్టరు. టీచర్, ఆయాలు ఎప్పుడొస్తరో.. ఎప్పుడు రారో తెలియదు. ఇప్పుడే కాదు మూడేళ్ల నుంచి ఇట్లనే అస్తుంది. ఈ విషయం గురించి సూపర్‌వైజర్లుకు చెప్పినా ఆయన మారడం లేదు. పిల్లలకు సరిగ్గా వస్తువులు అందేలా చూడాలి. ఇది చర్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఆవేదన.



ఉదయం పది గంటలైనా తెరుచుకోని కేంద్రం

జన్నారం: చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తీర్చి, ఆటపాటలతో బడికి అడుగులు వేసేలా చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ఆ అంగన్‌వాడీ కేంద్రం గతి తప్పుతుంది. అంగన్‌వాడీ టీచర్ ఆది నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలు సమయపాలన లేకుండా రావడంతో కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందని ద్రాక్షలా మారింది. జన్నారం మండలం చర్లపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రం నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రాస్‌గా మారింది. టీచర్, ఆయాలు సమయపాలన పాటించకుండా కేంద్రానికి వెళ్లడమే కాకుండా, చిన్నారులకు, గర్భిణీ, బాలింతలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం ఉదయం పది గంటలైనా టీచర్, ఆయాగాని అంగన్‌వాడీ కేంద్రానికి రాకపోయేసరికి అక్కడికి వెళ్లిన చిన్నారుల తల్లులు తిరిగి ఇంటికి వెళ్లారు.

ఇప్పటికే రెండుసార్లు మెమోలు...

అంగన్‌వాడీ టీచర్ సరిగ్గా కేంద్రానికి వెళ్లకుండా పౌష్టికాహారం అందించడం లేదని గ్రామస్తులు సూపర్‌వైజర్లకు పలుసార్లు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. గత ఐదు రోజుల క్రితం ఐసీడీఎస్ సీడీపీవో రేష్మా, సూపర్‌వైజర్ పద్మ కేంద్రాన్ని తనిఖీ చేయగా ఆ రోజు కేంద్రానికి వెళ్లకుండా తాళం వేసి ఉంచడంతో మెమో జారీ చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికే టీచర్ నిర్లక్ష్యంపై రెండు మెమోలు ఇచ్చినట్లు సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. అయినా మార్పు రాకపోవడం గమనార్హం.

మెమో జారీ చేస్తాం

చర్లపల్లి అంగన్‌వాడీ టీచర్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మేము స్వయంగా కేంద్రానికి వెళ్లి తనిఖీలు చేశాం. టీచర్, ఆయాలు సమయపాలన పాటించడం లేదు. ఈ విషయంలో చాలాసార్లు హెచ్చరించాం. రెండు మెమోలు జారీ చేశాం. అయినా మార్పు రావడం లేదు. మూడో మెమో కూడా జారీ చేస్తాం. ఫైల్ ఉన్నతాధికారులకు పంపిస్తాం.

\- పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పాఠశాలల్లో ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో కేక్ కట్ చేశారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో స్వరూప, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్ఞాన సరస్వతీ మాతా విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి చిన్నారులు శుభాకాంక్షలు తెలిపారు. జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో...

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫైర్‌క్యాంప్‌ను రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అంటించి ప్రారంభించారు. పాత కోపాలు, చెడు అలవాట్లను క్యాంప్‌లో వేసి, నూతన సంవత్సరం సందర్భంగా కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు

గెలిచిన సంఘాలు సమస్యలను పట్టించుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ పలు ఏరియాల్లో ప్రాతినిధ్య సంఘంగా గెలిచిన ఐఎన్టీయూసీ నాయకులు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఏరియాలోని కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి శనివారం మాట్లాడారు. జేబీసీసీఐలో చేసుకున్న ఒప్పందం ప్రకారం కనీస వేతనం సింగరేణిలో అమలు చేయాలని, అలాగే పండుగల సెలవులు, అర్జిత సెలవులు, వారికి కావాల్సిన సౌకర్యాలతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. నరేష్, భద్రయ్య, రాజేశ్వరి, స్వరూప, శారద, లక్ష్మి ఉన్నారు.

రిటైర్డు కార్మికులకు సన్మానం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఇరువురు కార్మికులను గని ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. జేఎండబ్ల్యూ కార్మికుడు అగ్గు ఎర్రయ్య, పంపు ఆపరేటర్ కరుణాకర్ ఉద్యోగ విరమణ చేయగా, ఆ కార్మిక దంపతులకు గని అధికారులు పూలమాలలు వేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్, రక్షణాధికారి రాజు, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, బీఎం ఇన్‌చార్జీ ముస్తాఫా, ఇంజనీర్ సైదులు, సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ సెక్రటరీ తిరుపతి గౌడ్, ఇతర కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మోర్ల భీమయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు కన్నెపల్లి యూత్ ఆధ్వర్యంలో రూ.30,300 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక వివేకానంద పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం కలిగిన పతాకాన్ని ముద్రించిన జెండాను ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ నవ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మండల ప్రధాన కార్యదర్శిగా రమేశ్

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన జంగిలి రమేశ్‌ను యూత్‌కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు అందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కసుకుల రాకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ చేతుల మీదుగా నియామకపత్రం అందించారు.

రాజారాంలో పౌరహక్కుల దినోత్సవం

వేమనపల్లి: మండలంలోని రాజారాం గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారి శ్రీపతి బాపురావు అధ్యక్షతన పౌరహక్కులపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన తమ హక్కులను కాపాడుకోవాలని ఎంపీడీఓ లక్ష్మయ్య సూచించారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి పోశం, అంగన్‌వాడీ టీచర్ సమ్మక్క, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

రాములవారి అక్షింతలతో శోభాయాత్ర

జైపూర్: మండల కేంద్రంలో గల భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అయోధ్య అక్షింతలకు హిందువులు ఘనస్వాగతం పలికారు. రాములవారి అక్షింతలతో ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. భక్తిగీతాలు ఆలపిస్తూ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణ, ఎంపీటీసీ లింగస్వామి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరవిందర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' దరఖాస్తుల వెల్లువ

బెల్లంపల్లి/చెన్నూర్/చెన్నూర్‌రూరల్/వేమనపల్లి/భీమిని/జైపూర్/కాసిపేట/తాండూర్/బెల్లంపల్లి రూరల్/మందమర్రిరూరల్/భీమారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమం శనివారం మూడోరోజు కొనసాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దరఖాస్తులు స్వీకరించారు. అర్జీదారులు అందజేస్తున్న దరఖాస్తులను స్వీకరించి అధికారులు రశీదులను పంపిణీ చేశారు.హాజీపూర్ మండలం వేంపల్లిలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాపాలన ప్రత్యేకాధికారి, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రశాంతి ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించి స్థానికులతో ముచ్చటించారు. మహిళలు, వృద్ధులను పలకరిస్తూ వారి అభయహస్తం దరఖాస్తులను పూర్తి చేయించేలా చూడాలని అధికారులకు అప్పగించారు. స్థానిక యువకులు కూడా తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో చెన్నూర్‌లో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, చెన్నూర్‌రూరల్ మండలంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, వేమనపల్లిలో జెడ్పీటీసీ స్వర్ణలత, సర్పంచ్‌లు గాలి మధు, దుర్గక్క, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, భీమినిలో ఎంపీడీఓలు జవహర్‌లాల్, రాధాకిషన్, తహసీల్దార్లు బికరణదాస్, దత్తప్రసాద్‌రావు, జైపూర్‌లో మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధశాఖ జేడీ రమేశ్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, కాసిపేటలో ఎంపీడీవో అలీం, తహసీల్దార్ భోజన్న, ఏఈ స్వర్ణలత, ఏఎంవో వందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ వినయ్, ఎంపీవో నాగరాజు, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, తాండూర్‌లో తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డీఎల్‌పీవో ఫణీందర్ రావు, ఎంపీవో సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, బెల్లంపల్లిలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్‌లు రాజలింగు, అశోక్, లక్ష్మీ, మందమర్రిలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో భీరయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, భీమారంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ విశ్వంబర్, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లిలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు

నస్పూర్‌లో అదనపు కలెక్టర్ పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఐదు గ్యారంటీల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. దరఖాస్తు ఫారాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దరఖాస్తు దారుడికి తప్పనిసరిగా రశీదు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రమేశ్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోండి

- మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: ప్రజాపాలన, అభయహస్తం దరఖాస్తుల ద్వారా అన్ని పథకాలపై దరఖాస్తులు చేసుకోవాలని ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. జన్నారం మండలం పొనకల్, జన్నారం గ్రామాల్లో శనివారం దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో రేఖానాయక్ మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ అమలు చేయడానికి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కలమడుగులో చేపట్టిన కార్యక్రమానికి గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ వేణుగోపాల్, రేంజ్ అధికారి హఫీజోద్దీన్, ఎంపీవో రమేశ్, జన్నారం ఎంపీటీసీ రియాజోద్దీన్, సర్పంచ్ గంగాధర్‌గౌడ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న రేఖానాయక్

దరఖాస్తులు అమ్మితే చర్యలు

బెల్లంపల్లి: ప్రజాపాలన దరఖాస్తులను అమ్మరాదని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల మంజూరుకోసం పురప్రజలకు ఉచితంగానే ప్రజాపాలన దరఖాస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరికీ ఉచితంగా అందిస్తారని తెలిపారు. దరఖాస్తు ఫారాలను జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులు అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉచితంగా అందజేస్తున్న దరఖాస్తులను తీసుకుని పురప్రజలు ప్రభుత్వ పథకాల కోసం అర్జీలు అందించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టోర్నమెంట్ ప్రారంభం

కాసిపేట: క్రీడలు శారీరక, మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని యువకులు క్రీడల్లో రాణించాలని ఎస్సై గంగారాం, తహసీల్దార్ భోజన్న తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి మైదానంలో శనివారం మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి(కాకా) స్మారక టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించగా ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని, వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొనడంతో పాటు పోటీల్లో క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు.

యువత క్రీడల్లో రాణించేందుకు పోటీలు

మంచిర్యాలటౌన్: యువత క్రీడల్లో రాణించేందుకు, క్రీడలను ప్రోత్సహించేందుకు రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా అటల్ బిహారీ వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లను శనివారం రఘునాథ్ ప్రారంభించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తూ, యువతకు ఉద్యోగ అవకాశాలు, కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి అండగా నిలుస్తున్నామన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘునాథ్

వాడీవేడిగా మండల సమావేశం

- సమస్యల పరిష్కారంపై అధికారుల నిలదీత
- అక్రమ ఇంటి నిర్మాణాలపై చర్యలకు డిమాండ్

బెల్లంపల్లిరూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ అనిల్ నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని కొన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు సరిగా పనులు కల్పించడం లేదని మండిపడ్డారు. ఎంపీవో శ్రీనివాస్ నివేదిక చదువుతున్న క్రమంలో చాకేపల్లి ఎంపీటీసీ మహేందర్ కలుగజేసుకుని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో, ఎల్లమ్మ గుడి సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో అక్రమ ఇంటి నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. పంచాయతీ కార్యదర్శులు, అధికారులు అక్రమ ఇంటి నిర్మాణాలకు ఇంటి నంబర్ల కేటాయింపుల్లో, పంచాయతీ కార్యదర్శులు, అధికారుల చేతివాటం ఉందన్నారు. ఆకెనపల్లి, సోమగూడెంలో కూడా అక్రమ వెంచర్లు, ఇంటి నిర్మాణాలు జరుగుతున్నా వాటిని నిలువరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందని మండిపడ్డారు. కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, అక్రమ ఇంటి నిర్మాణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అధికారులకు సూచించారు. అక్రమ ఇంటి నిర్మాణాలపై చర్యలు ఎందుకు చేపట్టడం లేదని జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ ప్రశ్నించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా పోషకాహారం లబ్ధిదారులకు అందించడం లేదన్నారు. కుళ్లిన గుడ్లు అందజేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని నిలదీశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో అభివృద్ధి పనులను బాధ్యతతో చేపట్టాలని సూచించారు. పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదివి సమావేశాన్ని మమా అనిపించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో రాజేందర్, వైస్ ఎంపీపీ రాణి,కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, ఎంపీటీసీలు మహేందర్, సుభాష్‌రావు, శకుంతల, అంకు, మల్లమ్మ, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.